రెచ్చిపోతున్న గ్రామ సింహాలు



- పట్టణాలు, పల్లెల్లో వీధి కుక్కల స్వైర విహారం
- నిత్యం కుక్కల దాడిలో గాయపడుతున్న వందలాది మంది
- పట్టించుకోని అధికారులు

ఇక్కడ చనిపోయిన గొర్రెలు మడకశిర నియోజకవర్గంలోని గౌడనహళ్లి పంచాయతీ పరిధిలోని తురకవాండ్లపల్లికి చెందిన గొర్రెల కాపరి ఈరప్పకు చెందినవి. నెలక్రితం ఊర కుక్కలు గొర్రెలపై దాడి చేయడంతో 12 గొర్రెలు, ఒక మేక చనిపోయాయి. కుటుంబానికి ఉన్న ఆదాయ వనరు కోల్పోవడంతో ఈరప్ప కన్నీరు మున్నీరయ్యారు.



నెలరోజుల వ్యవధిలో కుక్కలదాడి బాధితుల వివరాలు

మండలం	బాధితుల సంఖ్య
పెనుకొండ (టౌన్)	138
పెనుకొండ రూరల్	98
సోమందేపల్లి	54
రొద్దం	10
పరిగి	103
అమరాపురం	135
గుడిబండ	4
రొళ్ల	23
మడకశిర	209
హిందూపురం	541
లేపాక్షి	266
చిలమత్తూరు	305

పరిగి: పల్లెల్లో, పట్టణాల్లో గ్రామ సింహాలు గర్జిస్తున్నాయి. గుంపులు గుంపులుగా చేరి ప్రజలపై విరుచుకుపడుతున్నాయి. ప్రతి వీధిలోనూ పాదాచారులు, వాహన చోదకులను బెంబేలెత్తిస్తున్నాయి. ముఖ్యంగా కుక్కల భయంతో చిన్న పిల్లలను బడికి పంపాలంటేనే తల్లిదండ్రులు కలవరపడుతున్నారు. రాత్రి , పగలు తేడా లేకుండా నిత్యం వీధి కుక్క కరిచిన బాధిత వ్యక్తులు ఆస్పత్రులకు వస్తున్నారని వైద్యశాఖ అధికారులు చెబుతున్నారు. గ్రామాల్లో బంధువుల ఇళ్లకు, వ్యాపారాల నిమిత్తం వచ్చిన వారిని హడలెత్తిస్తున్నాయి. వాహనాల వెంట పడుతూ చోదకులను గాయపరుస్తున్నాయి.

కుక్కలతో రోడ్డు ప్రమాదాలు

ప్రధాన రోడ్లలో ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారులకు కుక్కలు అడ్డువస్తుండటంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రధానంగా వేగంగా వెళ్తున్న ద్విచక్ర వాహనదారులు ఇలాంటి ప్రమాదాల బారినపడుతున్నారు. ఆయా ఘటనల్లో ప్రాణాలు కోల్పోయిన వారు కూడా ఉన్నారు. కుక్కలను తప్పించబోయి వాహనాలు బోల్తా పడిన బాధితులు కూడా ఎంతో మంది ఉన్నారు.

నియంత్రణ చర్యలు శూన్యం

వీధికుక్కలను కట్టడి చేయడంలో సంబంధితశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రజల ప్రాణాలు పోతున్నా, ప్రమాదాల బారిన పడి గాయాల పాలవుతున్నా పట్టించుకోవడం లేదని ఆయా ప్రాంతాల్లోని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా కుక్కల సంఖ్య పెరగకుండా కు.ని ఆపరేషన్‌లు చేయించడానికి చొరవ చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

అరకొరగా యాంటీ రేబిస్ వ్యాక్సిన్

కుక్క కాటుకు వేసే యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు గోరంట్లతో పాటు మరికొన్ని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన మేరకు అందుబాటులో లేవు. కొన్ని మండలాల్లో వ్యాక్సిన్ సమయానికి లేకపోవడంతో బాధితులు ఇతర ప్రాంతాలకు వెళ్లి చికిత్స చేయించుకుంటున్నారు. అన్ని ఆస్పత్రుల్లో రేబిస్ వ్యాక్సిన్ అందుబాటులో ఉంచి సకాలంలో వైద్య చికిత్స నిర్వహించేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వ్యాక్సిన్ కొరత లేదు



కుక్క కాటు చాలా ప్రమాదకరం. ప్రతి ఆరోగ్య కేంద్రానికి రోజుకు కనీసం 8 నుంచి 10 మంది వరకూ కుక్క కాటు బాధితులు వస్తున్నారు. పీహెచ్‌సీల్లో యాంటీ రేబిస్ ఇంజక్షన్ల కొరత లేదు. కనీసం 10 వైల్స్ ఇంజక్షన్లు అందుబాటులో ఉంచుతున్నాం. అలాగే కుక్క కాటు బాధితులకు మెరుగైన వైద్య సేవలను అందిస్తున్నాం. కుక్కకాటు బాధితులు నిర్లక్ష్యం చేయకుండా, వెంటనే చికిత్స చేయించుకుంటే త్వరగా కోలుకునే అవకాశం ఉంటుంది.

– మంజువాణి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి

రొళ్ల: బాల్య వివాహాలను సమూలంగా నిర్మూలించేందుకు అందరూ కృషి చేయాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ షేక్షావలి, మడకశిర ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ నాగమల్లేశ్వరి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని ఎం.రాయాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆర్డీటీ, ఐసీడీఎస్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు.

తప్పిన ప్రమాదం

రొళ్ల: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ వెనక భాగంలో సోమవారం సాయంత్రం మంటలు చెలరేగాయి. వెలుగు, తహసీల్దార్, వ్యవసాయశాఖ కార్యాలయాలు ఒకే చోట ఉన్నాయి. కార్యాలయం చుట్టూ పక్కల పెద్ద వృక్షాలు కూడా ఉన్నాయి. ఎండిన ఆకులకు వ్యవసాయ సిబ్బంది నిప్పు పెట్టడంతో మంటలు పెద్దవయ్యాయి. పోలీస్‌స్టేషన్ వెనుక భాగంతో పాటు వెలుగు కార్యాలయం సైడ్ గోడ వరకూ మంటలు వ్యాపించాయి. పోలీసులు వెంటనే గమనించి నీటితో మంటలు అదుపులోకి తెచ్చారు. మంటలు ఆర్పక పోయి ఉంటే సీజ్ చేసిన ద్విచక్ర వాహనాలు అంటుకొని ఉండేవని పోలీసులు తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



రామక్క మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న వేణురెడ్డి

చిలమత్తూరు: హిందూపురం పట్టణంలోని 21వ వార్డు మోతుకుపల్లికి చెందిన వైఎస్సార్ వీరాభిమాని, వృద్ధురాలు మాల రామక్క అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నేత వేణురెడ్డి మోతుకుపల్లికి వెళ్లి రామక్క మృతదేహం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం చేశారు.

క్లుప్తంగా

శివరాత్రి ఉత్సవాలకు ఆహ్వానం



ఎస్పీ రత్నకు ఆహ్వానపత్రిక అందిస్తున్న రామానందన్

లేపాక్షి: ప్రముఖ పర్యాటక కేంద్రమైన వీరభద్రస్వామి దేవాలయంలో ఈనెల 25 నుంచి మార్చి 1వ తేదీ వరకూ జరిగే బ్రహ్మోత్సవాలకు రావాలని ఎస్పీ రత్నకు లేపాక్షి ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్ ఆహ్వానపత్రిక అందజేశారు. ఇందులో భాగంగానే ఆయన సోమవారం ఎస్పీ కార్యాలయానికి వెళ్లారు. బ్రహ్మోత్సవాలు విజయవంతమయ్యేలా అవసరమైన పోలీసు సిబ్బంది ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే డీఎస్పీ, రూరల్ సీఐ, ఎస్‌ఐలకు కూడా ఆహ్వాన పత్రికలు అందజేశారు.

ధరలు నియంత్రించండి



ఆర్డీఓ ఆనంద్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఐద్వా సభ్యులు

పెనుకొండ రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా అంతకంతకూ పెరిగిపోతున్న నిత్యావసరాల ధరలను నియంత్రించాలని ఐద్వా సభ్యులు ఆర్డీఓ ఆనంద్ కుమార్‌కు సోమవారం వినతిపత్రం ఇచ్చారు. ఉపాధి కింద పని దినాలను 200 రోజులకు పెంచాలన్నారు. కార్యక్రమంలో గౌతమి, సావిత్రి, సుమిత్ర, కాంతమ్మ, కవిత పాల్గొన్నారు.

శివరాత్రి వేడుకలు ప్రారంభం



ర్యాలీ నిర్వహిస్తున్న బ్రహ్మకుమారీలు

అమరాపురం: మండల కేంద్రంలోని బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో మహా శివరాత్రి ఉత్సవాలను నిర్వాహకురాలు పుష్పక్క ఆధ్వర్యంలో సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మహా శివరాత్రి విశిష్టతను తెలిపేలా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మహేంద్ర, క్రిష్ణమూర్తి, శివరుద్రప్ప పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

మడకశిర: పట్టణంలోని ప్రభుత్వ వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు వివిధ క్రీడల్లో అత్యంత ప్రతిభను కనబరిచారు. తూర్పుగోదావరి జిల్లా గరగల్లులో ఇటీవలనే రాష్ట్రస్థాయిలో వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు క్రీడా పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో మడకశిర కళాశాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. అన్ని విభాగాల్లోనూ ప్రథమ స్థానంలో నిలిచారు. సోమవారం కళాశాలలో క్రీడాకారులను సన్మానించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివకుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి పాల్గొన్నారు.

అధికారులతో ఎంపీ సమీక్ష

రొద్దం: ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎంపీ బీకే పార్థసారథి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఆర్ మరువపల్లిలోని ఎంపీ నివాసం వద్ద పలు అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. విధుల్లో ఎక్కడా అలసత్వం లేకుండా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉదయశంకర్‌రాజు, ఎంపీడీఓ రామ్‌కుమార్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

● ఆకట్టుకున్న సైన్స్‌ఫేర్



పర్యావరణాన్ని కాపాడే విధానాన్ని వివరిస్తున్న విద్యార్థి

రొద్దం: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని సీవైఆర్‌సీ కార్యాలయ ప్రాంగణంలో టింబక్టూ-కలెక్టివ్ స్వచ్ఛంద సంస్థ చిగురు ఆధ్వర్యంలో సోమవారం సైన్స్ ఫేర్ నిర్వహించారు. కాంప్లెక్స్ పరిధిలోని పలు పాఠశాల విద్యార్థులు తయారు చేసిన నమూనాలు అందరినీ ఆకట్టుకున్నాయి.



నమూనాలను ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

రుణాల మంజూరుకు ఇంటర్వ్యూలు

అమరాపురం: మండలంలోని వివిధ గ్రామాల్లోని బీసీ, ఈబీసీ, వైశ్య, రెడ్డి, బ్రాహ్మణ, కాపు కులాలకు చెందిన నిరుద్యోగ యువతీ యువకులకు రుణాల ఎంపికకు ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రామారావు తెలిపారు.

మడకశిర: పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బీసీ, కాపు కార్పొరేషన్లలో సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు మంగళవారం ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సోనిబాయి ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తప్పనిసరిగా ఆన్‌లైన్ దరఖాస్తు, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, విద్యార్హతల సర్టిఫికెట్లు, బ్యాంక్ పాసు పుస్తకం, ఫొటోలు తదితర వాటిని తీసుకుని హాజరు కావాలని కోరారు.

రొద్దం: మండల వ్యాప్తంగా అన్ని బ్యాంకుల పరిధిలో బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు దరకాస్తులు చేసుకున్న లబ్ధిదారులకు సంబంధించిన మంగళవారం ఉదయం 11 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఈఓఆర్డీ గోవిందప్ప తెలిపారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి లబ్ధిదారుడు సర్టిఫికెట్లతో తప్పక హాజరు కావాలని కోరారు. పంచాయతీ కార్యదర్శులు, అన్ని బ్యాంకుల మేజర్లు హాజరు కావాలన్నారు.

హిందూపురం అర్బన్: హిందూపురం మున్సిపాలిటీ పరిధిలోని బీసీ, ఈబీసీ, కాపు కార్పొరేషన్ పథకాల కింద 2024-25 సంవత్సరానికి రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి రుణాలు మంజూరుకు ఎంపిక కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. 20వ తేదీ ఉదయం 10 గంటలకు మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ హాల్‌లో ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో తప్పకుండా హాజరు కావాలన్నారు.

ఘనంగా జ్యోతుల ఉత్సవం



జ్యోతులు మోస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ , భక్తులు



అగళి మండలం ఇరిగేపల్లిలో జ్యోతులతో మహిళా భక్తులు

పరిగి: మండలంలోని జంగాలపల్లిలో సోమవారం జ్యోతుల ఉత్సవాన్ని నిర్వహించారు. గ్రామంలో సగర ఉప్పర కుల బాంధవుడు శ్రీభగీరథ మహర్షి విగ్రహావిష్కరణ సందర్భంగా వేడుకను నిర్వహించారు. భక్తులతో పాటు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ జ్యోతులు సమర్పించారు. మహిళలు పెద్ద ఎత్తున జోత్యులతో ఊరేగింపుగా కాటమయ్య ఆలయం వద్దకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలందరికీ మంచి జరగాలని కాటమయ్య స్వామిని వేడుకున్నట్లు ఉషశ్రీచరణ్ తెలిపారు. ఆమె వెంట వైఎస్సార్‌సీపీ నేత చరణ్‌రెడ్డి, సర్పంచ్ మంజునాథ్‌రెడ్డి, మండల కన్వీనర్ నరసింహమూర్తి, తదితరులున్నారు.

అగళి: మండల పరిధిలోని ఇరిగేపల్లిలో వెలసిన ఆంజనేయస్వామి, శనీశ్వరస్వాములకు సోమవారం జ్యోతుల ఉత్సవాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగానే ఉదయం నుంచి స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు ఉపవాస దీక్షలతో జ్యోతులను ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయాల్లో సమర్పించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

హిందూపురం టౌన్: మున్సిపల్ ఇంజనీరింగ్, శానిటేషన్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు సోమవారం నిరసన తెలిపారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వినోద్ కుమార్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఇంజనీరింగ్, శానిటేషన్ కార్మికులకు అప్కాస్ విధానాన్ని రద్దు చేయడం హర్షించదగ్గ విషయమని, అయితే మున్సిపల్ కార్మికులను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పజెప్పకుండా మున్సిపాలిటీనే నేరుగా జీతాలు అందించాలన్నారు. మున్సిపల్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్‌లో పని చేస్తున్న మున్సిపల్ శానిటేషన్, ఇంజనీరింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఈనెల 17 నుంచి నుంచి మార్చి 6వ తేదీ వరకూ దశలవారీగా రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో శానిటేషన్ విభాగం అధ్యక్షుడు ముత్యాలప్ప, కార్యదర్శి సురేష్, మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షుడు రంజాని, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

కదంతొక్కిన అంగన్‌వాడీలు



హిందూపురం: ఐసీడీఎస్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



పెనుకొండ: ప్రధాన రహదారిపై మానవహారం చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది



మడకశిర: ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

సాక్షిబృందం: సమస్యలు పరిష్కరించాలంటూ అంగన్‌వాడీ కార్యకర్తలు కదం తొక్కారు. హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని ఐసీడీఎస్ కార్యాలయాల ఎదుట సోమవారం ధర్నాలకు దిగారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు వేతనాలు పెంచాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలి తదితర డిమాండ్లతో ఆందోళన చేశారు. సంక్షేమ పథకాలు అందించాలని, సాధికారత సర్వేలో ప్రభుత్వ ఉద్యోగులనే పదాన్ని తొలగించాలన్నారు. ప్రీస్కూల్ పిల్లలకు కూడా తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలని కోరారు.

నేడు కొల్లాపురమ్మ ఉత్సవం

అగళి: మండల పరిధిలోని నరసబుందిలో సోమవారం సాయంత్రం నుంచి రత్నగిరి కొల్లాపురమ్మ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. రెండు రోజులపాటు ఈ ఉత్సవాలు వైభవంగా నిర్వస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రత్నగిరి గ్రామం నుంచి మహాలక్ష్మీదేవిని ఊరేగింపుగా తీసుకొచ్చారు. నరసబుందిలో పట్టం కూర్చొబెట్టి పూజలు చేశారు. మంగళవారం అమ్మవారికి మహిళలు భక్తిశ్రద్ధలతో జ్యోతుల ఉత్సవం నిర్వహించనున్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

పరిగి: మండల సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీధర్ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమావేశ భవనంలో ఎంపీపీ సవిత అధ్యక్షతన ఉదయం 10 గంటలకు సమావేశం జరుగుతుందన్నారు. మండలంలో మూడు నెలలుగా జరిగిన అభివృద్ధి, సంక్షేమంతో పాటు చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలపై సభలో చర్చించడం జరుగుతుందన్నారు. మండలంలో నెలకొన్న సమస్యలపై సమావేశంలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. మండల అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరు కావాలన్నారు.

చింత ఫలసాయం వేలం

లేపాక్షి: మండలంలోని పులమతి గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం ఉదయం గ్రామ సర్పంచ్ అశ్వత్థనారాయణ అధ్యక్షతన చింత ఫలసాయం వేలం పాట నిర్వహించారు. పులమతికి చెందిన రాము రూ. 51 వేలకు పాట దక్కించుకున్నారు.

బాధితుల ఫిర్యాదులు స్వీకరిస్తాం

హిందూపురం అర్బన్: హిందూపురం పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో బాధితుల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరిస్తామని డీఎస్పీ మహేష్ తెలిపారు. ప్రతి సోమవారం ఉదయం 11 గంటల నుంచి 2 గంటల వరకూ హిందూపురం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరిస్తామన్నారు. నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సంక్షిప్త సమాచారం

సమస్యలు పరిష్కరించాలి

హిందూపురం టౌన్: రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐయూటీయూసీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సోమవారం నాయకులు పట్టణంలో ర్యాలీ చేపట్టి అంబేద్కర్ సర్కిల్ నుంచి తహసీల్దార్ కార్యాలయం చేరకుని డీటీ మైనుద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. ఏఐయూటీయూసీ రాష్ట్ర కార్యదర్శి అశోక్ మాట్లాడుతూ పారిశుద్య కార్మికులు, స్కూల్ ఆయాలకు, వాచ్‌మెన్‌లకు రూ.15 వేలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు హరిప్రసూన్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శిక్షణ తరగతులు

పరిగి: మండలంలోని అంగనవాడీ వర్కర్లకు మంగళవారం నుంచి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజిత తెలిపారు. మండలంలోని సేవామందిరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిక్షణ తరగతుల గదులను ఎంఈఓలు లక్ష్మీదేవి, శేషాచలం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజిత సోమవారం పరిశీలించారు.

ప్రతి రైతుకూ విశిష్ట సంఖ్య

గుడిబండ: కేంద్ర ప్రభుత్వం ఆధార్ తరహాలో ప్రతి రైతుకూ ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి వీరనరేష్ తెలిపారు. సోమవారం మోరుబాగల్, గుణేమోరుబాగల్, జంబులబండ పంచాయతీల్లోని రైతు సేవా కేంద్రాలను ఆయన సందర్శించి రైతులకు అవగాహన కల్పించారు.

లక్ష్యాలను పూర్తి చేయండి

అగళి: గోకులం షెడ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయించాలని ఇన్‌చార్జ్ ఏపీడీ లక్ష్మీనారాయణ సిబ్బందికి సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు.

శివస్వాములకు అన్నదానం

సోమందేపల్లి: మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయంలో శివస్వాములకు ఏజీపీ భాస్కర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు అశోక్ ఆధ్వర్యంలో సోమవారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వివిధ సమస్యలపై 15 అర్జీలు

పెనుకొండ రూరల్: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కర వేదికకు వివిధ సమస్యలపై 15 ఫిర్యాదు అందినట్లు సిబ్బంది తెలిపారు.

'మాలల యుద్ధ గర్జన'కు తరలిరండి

పెనుకొండ రూరల్: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 23వ తేదీన కర్నూలులోని ఎస్టీ, బీసీ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న మాలల యుద్ధ గర్జన సభను విజయవంతం చేయాలని మాల మహనాడు జిల్లా అధ్యక్షుడు ఎం నరసింహమూర్తి పిలుపునిచ్చారు. జిల్లా వ్యాప్తంగా మాల ఉప కులలకు చెందిన వారందరూ కార్యక్రమానికి తరలిరావాలని కోరారు. సోమవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం ఇటీవల ఓ ప్రముఖ స్వచ్ఛంద సంస్థ చేత డాక్టరేట్ పొందిన ఎస్సీ,ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చెరుకూరి గంగులయ్యను సత్కరించారు. కార్యక్రమంలో సోమన్న, కురుగుంట గోవిందు, గొల్లపల్లి నాగేంద్ర, కౌన్సిలర్ శేషాద్రి, షామిల్ మూర్తి, లక్ష్మీనారాయణ, రామాంజినేయులు, నరసింహులు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన
మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు, హిందూపురం
O.S. 20/2022
Between :
R. Narasimha Reddy ...Plaintiff
V/s
B.G. Ananda Murthy and 2 Others ...Defendants
Notice to Defendant No. 2 Smt. Aiswarya
పై కోర్టు యందు వారి మీపైన మరియు ఇతరుల పైన దావావేసినారు. మీ యొక్క హాజరు నిమిత్తము **20-02-2025వ తారీఖున** వాయిదా వేసినారు. పై తేదీన **ఉదయము 10-30 గంటలకు** స్వయముగా గాని మీ తరుపున వకీలు గారు గాని హాజరు కావలెను. లేని పక్షములో కేసు వారి తరుపున తీర్మానించబడును.
Senior Civil Judge, Hindupur వారి ఉత్తర్వుమేరకు
B.S. Rami Reddy, Advocate, Hindupur

వైభవంగా వేంకటేశ్వర కల్యాణం





అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి, కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

హిందూపురం టౌన్: పట్టణంలోని బాలాజీనగర్‌లో వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయ 21వ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. తెల్లవారుజామునుంచే శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధ్వజారోహణ, ప్రాకారోత్సవం, సుదర్శన హోమం, బలిహరణ, పూర్ణాహుతి హోమాలు తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివార్లను వేదికపై కొలువుదీర్చి అశేష జన సందోహం నడుమ వేద పండితుడు సునీల్‌శర్మ, అర్చకులు సాంప్రదాయబద్ధంగా కల్యాణోత్సవాన్ని జరిపించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు సతీష్ కుమార్, ఆలయ కమిటీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, సెక్రటరీ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.